క్లుప్తంగా

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో గురువారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద సీతారాముల ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో స్వామివారి చెంతన శ్రీరామ షడక్షరీ, సంక్షిప్త రామాయణ పారాయణాన్ని జరిపారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి లోకేష్



లోకేష్‌కి అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికలను దేవస్థానం ఈవో త్రినాథరావు అందజేశారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గణబాబు తదితరులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు 28న

అగనంపూడి : పెందుర్తి నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల ఎంపికలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం 27వ తేదీన నిర్వహించాల్సి ఉండగా, వర్షాల కారణంగా ఒక రోజు వాయిదా వేసినట్టు ఆమె తెలిపారు. ఆయా మండలాల కోఆర్డినేటర్లు గమనించాలని ఆమె కోరారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా పోటీలు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, షటిల్ బాడ్మింటన్ పోటీలు, ఎంపికలు పరవాడలోని ఇండోర్ స్టేడియంలో అదే రోజు నిర్వహించనున్నామని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎంట్రీ ఫారాలతో హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఫ్యాన్ల వితరణ



ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌కు ఫ్యాన్లు అందిస్తున్న కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సొసైటీ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పెందుర్తి కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఫ్యాన్లు సమకూర్చారు. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌కు సొసైటీ ప్రతినిధులు 5 ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు జి.సత్యగణపతిరావు, ఆర్.ఎస్.శేఖర్‌బాబు, జి.భాస్కర్, జి.మురళి, డి.బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



వడ్డిస్తున్న సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ జగన్నాథరావు

పరవాడ: తానాం గ్రామంలో వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ కన్నూరు దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు అన్నసమారాధన ప్రారంభించారు. తానాం పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, రామాలయ యూత్ సభ్యులు పైల కృష్ణ, రామచంద్రరావు, జి.చంద్రశేఖర్, రొంగలి ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

అందాల తీరం.. ఆదమరిస్తే ప్రాణాంతకం

- వీకెండ్స్, హాలీడేస్‌లో తిక్కవానిపాలెం తీరానికి సందర్శకుల తాకిడి
- యువత అత్యుత్సాహంతో ప్రమాదాలు
- పోలీస్ పికెట్ ఎత్తేయడంతో ఇష్టారాజ్యం
- సాయంత్రాలు మందుబాబులకు నిలయాలు

తిక్కవానిపాలెం తీరం.. కనుచూపు మేర సమతలంగా ఉన్నట్లు కనిపించే సాగరం. ఫొటోలకు ఫోజులిచ్చేందుకు అనువైన పొడవైన ఎన్టీపీసీ జెట్టీ, సీ వాటర్ పార్క్, మండుటెండలోనైనా సేదదీరేలా నిర్మించిన సిమెంట్ గొడుగులతో యువత, ఫ్యామిలీ సందర్శకులకు ఆనందాల నిలయం. ఈ ఆనందాల మాటున ఉన్న ఆపదను గుర్తించట్లేదు. పోలీస్ పికెట్, గజ ఈతగాళ్లు లేకపోవడంతో యువత రెచ్చిపోయి మరీ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.



పర్యాటకులు సేదతీరేందుకు తీరంలో ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన గొడుగులు



పర్యాటకుల ఆనంద నిలయం..తిక్కవానిపాలెం తీరం



కెరటాలకు ఎదురీదుతున్న యువత

పరవాడ: వారాంతం, సెలవులు వచ్చాయంటే ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి వచ్చే సందర్శకులతో తిక్కవానిపాలెం తీరం కళకళలాడుతుంది. ఆదివారం ఆటవిడుపుగా గడపాలన్నా, పుట్టిన రోజు, పెళ్లి రోజు తదితర వేడుకలు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ఈ తీరం చాలా ఆకర్షణీయం. ఈత సరదా తీర్చుకోవాలనుకునే వారికి వందల మీటర్ల దూరం సమతలంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ ఆనందం, సరదాలో తెలియకుండానే లోపలికి వెళ్లడం, కొన్ని చోట్ల ప్రమాదకర లోతులు, ఆకస్మికంగా వచ్చే రాకాసి అలలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

సాయంత్రం.. మందుబాబుల వీరంగం

వారాంతపు రోజులు, సెలవు దినాల్లో ఈ తీరం మరింత రద్దీగా ఉంటుంది. ఆదివారం వచ్చిందంటే కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే యువత, విద్యార్థులతో తీరం కిక్కిరిసిపోతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిచేసి సాయంత్రం తీరంలో సముద్ర స్నానాలు చేసి ఉత్సాహంగా గడుపుతారు. వేడుకలు చేసుకునేందుకు వచ్చే యువత వెంట తెచ్చుకున్న మద్యం సేవించి ఇష్టానుసారంగా ప్రవర్తించడం, పిచ్చి చేష్టలు పెరుగుతున్నాయి. అదే ఉత్సాహంలో సముద్రంలో ఈతకు దిగి ప్రాణాల మీదకూ తెచ్చుకుంటున్నారు. మరోవైపు సాయంత్రాలు తీరంలో మందుబాబుల చిందులు ఇటీవల పెరుగుతున్నాయి. దీంతో సాయంత్రాలు పిల్లలతో తీరానికి వెళ్లాలంటే వెనుకడుగు వేసే పరిస్థితి.

కొరవడిన పోలీస్ నిఘా

తీరంలో సందర్శకుల తాకిడి నేపథ్యంలో పోలీస్ పికెట్ తప్పనిసరి. గతంలో పోలీసుల గస్తీ ఉండేది. ఆ సమయంలో యువత ఆకతాయి చేష్టలకు అడ్డుగట్ట పడేది. కొన్నాళ్ల నుంచి పోలీస్ పికెట్ ఎత్తేశారు. దీంతో యువత రెచ్చిపోతోంది. మద్యం సేవించడానికి తీర ప్రాంతాన్నే ఎంచుకుంటున్నారు. ఇక్కడి ఇసుక తిన్నెల్లో ఎక్కడికక్కడ దర్శనమిచ్చే ఖాళీ మద్యం సీసాలే ఇందుకు నిదర్శనం.

రాకాసి అలలకు.. ప్రాణాలు బలి

- 2018 జూన్ 17న వెన్నలపాలేనికి చెందిన నలుగురు యువకులు తీరంలో సరదాగా ఈతకు దిగారు. ఉల్లాసంగా ఈదుతున్న పైల మహేష్, సిరపరపు రామకృష్ణ, లాలం నరసింగరావు, మాసవరపు నరేష్ అనే యువకులను రాకాసి అలలు బలితీసుకున్న ఘటన కలవరపెట్టింది.
- మూడేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన ఓ కుటుంబం తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చి, అలల ధాటికి ఇద్దరు చిన్నారులు, మరో వ్యక్తి బలయ్యారు.
- గతేడాది జులైలో తీరంలో ఈతకు దిగిన అనకాపల్లి ప్రాంతానికి చెందిన కళాశాల విద్యార్థుల్లో కె.గౌతమ్‌శివ ప్రాణాలు పోగొట్టుకుని కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. ఈ ప్రమాదాలు మచ్చుకు కొన్ని మాత్రమే.

గజ ఈతగాళ్లను నియమించాలి



తీరంలో గజ ఈతగాళ్లను పెట్టాలి. కనీసం సెలవు దినాల్లోనైనా ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదాలను నియంత్రించవచ్చు. తీరంలో ఈతకు దిగేవారిని నియంత్రించే వారు లేక తెలియకుండానే.. లోతుకు వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు సందర్శకుల రద్దీ వేళల్లో తప్పనిసరిగా రక్షణ ఏర్పాట్లు ఉండాలి.

– కె.సోమునాయుడు, వాడచీపురుపల్లి

పోలీసుల్లేక.. యువత ఇష్టారాజ్యం



తీరంలో గతంలో ఎత్తివేసిన పోలీస్ పికెట్‌ను పునరుద్ధరించాలి. అప్పట్లో పోలీసులను చూసి యువత కొంత భయపడేది. పోలీస్ పికెట్‌ను తొలగించిన తరువాత యువకులు రెచ్చిపోయి మరీ సముద్రంలో ఈతకు దిగుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. కుంది. తీరంలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి.

– తిక్కాడ ఆనంద్, తిక్కవానిపాలెం

పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తాం



తీరంలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి, తీరంలో ఈతకు దిగుతున్న యువతకు అవగాహన కల్పిస్తాం. తీరంలో మద్యం సేవించే వారు, అల్లరి చేష్టలకు దిగుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. సముద్రంలో లోతుకు వెళ్లకుండా సందర్శకులను, యువతను అప్రమత్తం చేస్తాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్ భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జగన్‌ను కలిసి పెందుర్తి నియోజకవర్గ ప్రస్తుత పరిస్థితిని వివరించారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. పలు అంశాలపై అధినేతతో చర్చించారు. - పెందుర్తి

చిరుధాన్యాల సాగుకు సహకారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ప్రకృతి ఫల సంఘం ప్రతినిధులు

పెందుర్తి: ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వరి కంటే చిరు ధాన్యాల సాగు మేలని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ అన్నారు. చిరుధాన్యాల సాగుకు రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామన్నారు. మండలంలోని పినగాడిలో గురువారం నిర్వహించిన ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు ధాన్యాల వినియోగం పెరిగినందున తక్కువ వ్యయంతో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతి ఫల క్యాలెండర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, సంఘం చైర్మన్ వెన్నెల పెంటబాబు, సీఈవో ఎస్.ప్రవీణ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



చెరువును తలపిస్తున్న సబ్బవరం పోలీస్ స్టేషన్

సబ్బవరం: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. మండలం కేంద్రంలోని సబ్బవరం పోలీస్ స్టేషన్ ముంపునకు గురై చెరువును తలపించింది. సబ్బవరంలోని డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో తరచూ పోలీస్ స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలు చిన్నపాటి వర్షానికీ తరచూ ముంపునకు గురవుతున్నాయి. సాయినగర్ కాలనీ నుంచి ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారితో పాటు, పోలీస్ స్టేషన్ ముంపునకు గురవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు త్వరితగతిన డ్రైన్లు నిర్మించి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రామాలయ నిర్మాణానికి నూతన్ నాయుడు విరాళం



గ్రామ పెద్దలకు విరాళం చెక్కును అందిస్తున్న బిగ్‌బాస్ ఫేమ్ నూతన్‌నాయుడు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం గ్రామం రామాలయ పునర్నిర్మాణానికి స్థానికుడు, బిగ్‌బాస్ ఫేమ్ మేడపురెడ్డి నూతన్ నాయుడు రూ.30 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం రూ.10 లక్షల చెక్కును అందించారు. ప్రస్తుతం విదేశాలలో ఉంటున్న ఆయన పెందుర్తిలోని సుజాతనగర్‌లో తన నివాసానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు ఆయన్ని కలిసి, ఆలయ పునర్నిర్మాణ విషయం చెప్పారు. గ్రామంలో సుమారు 700 సంవత్సరాల చరిత్ర గల ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. దీంతో ఆలయ నిర్మాణానికి, గ్రామాభివృద్ధికి తన వంతు సాయం చేస్తానంటూ, తొలి విడతగా రూ.10 లక్షలకు చెక్ ఇచ్చారు. గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన్ నాయుడిని కలిసిన వారిలో గ్రామ పెద్దలు గొంప నాయనప్ప, పైల వెంకటరమణ, పంచాడ శ్రీనివాసరావు, పంచాడ దేముడు మాస్టర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం బృందానికి సహకరించండి

- జేసీ మయూర్ అశోక్



పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ కె.మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్‌ఎల్‌ఎం) బృందానికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌ఎల్‌ఎం బృందం సభ్యుల క్షేత్ర స్థాయి పర్యటనపై గురువారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడీవోలతో జేసీ సమీక్షించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ స్థాయిలో అమలయ్యే కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై బృందానికి వివరించాలని చెప్పారు. బృంద సభ్యులు అనిల్ నింభోర్కర్, అనిల్ గైక్వాడ్ రోజుకు రెండు పంచాయతీల్లో ఐదు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభారాణి, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, డీపీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కె. శ్రీనివాసరావు, ఎల్డీఎం ఎం.శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



ల్యాబ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పెదగంట్యాడ : విద్యార్థులు ఆధునిక సౌకర్యాలను వినియోగించుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్సార్ నిధులు రూ.34 లక్షలతో ప్రభుత్వ న్యూ ఐటీఐలో ఆధునికీకరించిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కోరమాండల్ సీఎస్సార్ నిధులతో విద్యార్థులకు ఉపయోగపడేలా కంప్యూటర్ ల్యాబ్‌ను ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. 25 కంప్యూటర్లు, మూడు ఏసీలు, ఐదు ఫ్యాన్లు, ఒక యూపీఎస్‌ను అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 80 మంది విద్యార్థులకు ఉలెన్ దుప్పట్లు పంపిణీ చేశారు. కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్, ప్లాంట్ హెడ్ ఎం.జ్ఞాన సుందరం, సీఎస్సార్ హెడ్ జయగోపాల్, హెచ్‌ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, ఐటీఐల ఆర్‌డీడీ ఆర్.వి.రమణ, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఏకే బాలాజీ, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

పరవాడ: ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన విశ్వజిత్ రాబర్(25) అనారోగ్యంతో గురువారం మరణించినట్లు అతని అన్న సురాజ్ రాబర్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు. ఉదయం 5.30 గంటల సమయంలో విశ్వజిత్ తల తిరుగుతుందని మాత్రలు తీసుకురావాలని అన్నయ్య సురాజ్‌కు చెప్పాడు. మాత్రలు తెచ్చేందుకు లంకెలపాలెం కూడలికి వెళ్లగా అక్కడ షాపులు తెరవకపోవడంతో వెనుదిరిగాడు. ఇంతలో విశ్వజిత్ రూం బయట రోడ్డుపై పడి ఉండడాన్ని గమనించిన సురాజ్ వెంటనే చికిత్స కోసం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్లు పరీక్షించి మరణించినట్లు ధ్రువీకరించారని పోలీసులకు సురాజ్ తెలిపాడు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: విజయవాడ వరదల సమయంలో అక్కడకు వెళ్లి సేవలందించిన జీవీఎంసీ 94వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం ఘనంగా సత్కరించారు. వరదల సమయంలో వారు చేసిన సేవలను కొనియాడారు. అత్యవసర సమయంలో కనీస సౌకర్యాలు లేకపోయినా బాధితులకు సాయపడేందుకు, అక్కడి పారిశుధ్య పనుల్ని నిర్వహించేందుకు వెళ్లిన కార్మికులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-8 జెడ్సీ హైమావతి, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, స్థానిక కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెందుర్తి తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్

పెందుర్తి: మండల తహసీల్దార్‌గా ఎం.ఆనంద్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పెందుర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.వేణుగోపాల్ వీఎంఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. ఆనంద్‌కుమార్ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవ



పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ అవరణతో పాటు, పరిసర ప్రాంతాలను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శుభ్రం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో ప్రజా వంచన



కోన రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

పరవాడ: ఎన్డీయే కూటమి వంద రోజుల పాలనను ప్రజా వంచన పాలనగా పరవాడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు అభివర్ణించారు. గురువారం స్థానిక మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు ఆశపడి ఓట్లేసిన ప్రజలను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వంద రోజుల పాలన గురించి గొప్పలు చెప్పుకొంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో అధికారులను భయపెట్టే ప్రయత్నం తప్ప.. ఇంకేమీ లేదన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తానని చెప్పిన పవన్‌కల్యాణ్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబును ఎందుకు నిలదీయట్లేదని ధ్వజమెత్తారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీలను అధికారం చేపట్టిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అమృతానంద సరస్వతి జయంతి



దేవీపురంలోని యాగశాలలో యంత్ర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో దేవీపురం వ్యవస్థాపకులు అమృతానంద సరస్వతీ 90వ జయంతిని పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి, బాల, వారాహి, లలిత జప, తర్పణ, యంత్ర పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. గురుకటాక్షం పొందేందుకు దేశ విదేశాల నుంచి పలువురు శిష్యులు తరలివచ్చారు. మధ్యాహ్నం శిష్యులందరిచేత సామూహిక అమృత జయంతి హోమం నిర్వహించారు. అనంతరం గురుపాదుకా పల్లకీ సేవ, గురుపాద పూజ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి 15 మంది బాలికలతో నిర్వహించే అమృత కన్యా గురుకులం ప్రాంగణాన్ని గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మేహాద్రి రిజర్వాయర్ గేటు ఎత్తివేత

రెండో గేటు నుంచి 350 క్యూసెక్కుల విడుదల



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేటును అధికారులు గురువారం ఎత్తారు. రిజర్వాయర్ నీటి మట్టం ఉదయానికి 59.5/61 అడుగులకు చేరుకోవడంతో గేటును తెరిచేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెండో గేటును ఆరు అడుగుల మేర ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. గురువారం రాత్రికి మేహాద్రి నీటిమట్టం 59.5/61 అడుగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు.

డ్వామా పీడీ పూర్ణిమాదేవి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి

మహారాణిపేట: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీడీగా ఉన్న ఈ.సందీప్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పూర్ణిమాదేవిని డ్వామా పీడీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.